క్లుప్తంగా

శ్రీవారి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం



కల్యాణ మహోత్సవాలను ప్రారంభిస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పడమర వీధి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి కల్యాణ మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రనసాద వితరణ చేశారు. రాత్రి 7 గంటల నుంచి అంకురార్పణ, వాస్తు పూజ, హోమాలు, ధ్వజారోహన పూజలు నిర్వహించారు. యాజ్ఞిక బ్రహ్మ దీవి గోపాలాచార్యులు, అర్చకులు రత్నాకరం శ్రీనివాస మూర్తి విశేష పూజలు చేశారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ రాళ్లపల్లి పద్మావతి, ట్రస్టీలు మధ్యాహ్నపు సుబ్రహ్మణ్యం, ఆర్.శ్రీనివాసు పాల్గొనగా కార్యనిర్వహణాధికారి ఎ.రవిశంకర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

డీఏ బకాయిల మంజూరు ఉత్తర్వులపై హర్షం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉద్యోగులకు, పెన్షనర్లకు 2022 జనవరి నుంచి ఇవ్వాల్సిన డీఏను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేయడంపై పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జీఓ 66 ద్వారా ఉద్యోగులకు, జీఓ 67 ద్వారా పెన్షనర్లకు 2.73 శాతం డీఏగా మంజూరు చేశారని తెలిపారు. ఈ జీఓల ప్రకారం కొత్త డీఏను జూలై 1వ తేదీ జీతంతో కలిపి ఇస్తారని పేర్కొన్నారు. 2022 జనవరి నుంచి జూన్ 2023 వరకు ఇవ్వాల్సిన డీఏను సెప్టెంబర్, డిసెంబర్, మార్చి నెలల్లో మూడు సమాన వాయిదాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో చెల్లిస్తారని తెలిపారు. ఈ కొత్త డీఏతో కలిపి ఉద్యోగులకు 22.75 శాతం డీఏగా వస్తుందని వివరించారు.

వ్యక్తిపై కేసు నమోదు

పెదపాడు: వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని గుడిపాడుకి చెందిన జయమంగళ వెంకటేష్ వివాహితను తరచూ వేధిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వెంకటేష్‌పై సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాడవాడలా అరుణ పతాక రెపరెపలు

ఘనంగా మేడే వేడుకలు



సీపీఎం ఆధ్వర్యంలో ప్రదర్శన చేస్తున్న నాయకులు



ఆటోలతో భారీ ర్యాలీ



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి రాజేశ్వరి



సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద మేడే వేడుక



మేడే వేడుకలో మాట్లాడుతున్న డీసీఎల్ ఆలోచన

ఏలూరు (టూటౌన్): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలను సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో అరుణ పతాకాలు రెపరెపలాడాయి. జోరు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కార్మికులు ర్యాలీలు, ప్రదర్శనలు, బహిరంగ సభలు నిర్వహించారు. నాయకులు మేడే విశిష్టతను వివరించారు. సీపీఎం ఆధ్వర్యంలో హనుమాన్ నగర్, సుందరయ్య కాలనీ, కుమ్మరి రేవు,రాణినగర్, తంగెళ్లమూడి, శనివారపు పేట, బావిశెట్టి వారి పేట, పడమర వీధి, గాంధీ నగరం, చోడిదిబ్బ, కొత్తపేట చేపల తూము సెంటర్, పత్తేబాద తదితర 25 ప్రాంతాల్లో జెండాలను ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజావ్యతిరేక మతోన్మాద కార్పొరేట్ సంస్థల అనుకూల విధానాలను మేడే స్ఫూర్తితో తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్‌లు పిలుపు నిచ్చారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, గొట్టాపు రవి కిషోర్, కె.రామాంజనేయులు, వీవీఎస్ ప్రసాద్, వైఎస్ కనకారావు, చింతాడ వెంకటలక్ష్మి, సీహెచ్ రాజ్యలక్ష్మి, కంది విశ్వనాథం, జి.ఏసుబాబు, టి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యకు నివాళి

పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయం వద్ద పార్టీ జెండాను రవి ఎగురు వేశారు. మేడే వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షత వహించారు.

సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో..

ఏలూరు, కొత్తూరు జూట్ వర్కర్స్, భవన నిర్మాణ కార్మికులు, కార్పెంటర్లు, పెయింటర్లు, ఆటో డ్రైవర్లు, ముఠా కార్మికులు, గోడౌన్స్ కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ వర్కర్లు, క్లాప్ ఆటో డ్రైవర్లు, ఆర్టీసీ వర్కర్లు, టింబర్ డిపో వర్కర్లు, ఎల్ఐసీ ఏజెంట్లు, మెడికల్ రిప్స్ తదితర సంఘాల ఆధ్వర్యంలో 45 కార్మిక కేంద్రాలు, పలు కూడళ్లల్లో మేడే వేడుకలు నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎ.రవి, సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు బి.జగన్నాథరావు, వీవీఎస్ ప్రసాద్, వి.సాయిబాబు, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ సుందరయ్య, ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఐవీ సుధాకర్, మెడికల్ రిప్స్ రాష్ట్ర కార్యదర్శి వీవీఎస్ ప్రసాద్ జెండాలను ఆవిష్కరించారు. ఆర్ఆర్‌పేట పార్కు నుంచి ప్రభావతి ఆస్పత్రి, గంగానమ్మ గుడి, పవరుపేట రైల్వే స్టేషన్ మీదుగా పవరుపేట సీఐటీయూ ఆఫీసు వరకు ప్రదర్శన చేశారు. ఆటో డ్రైవర్లు పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ఆటోల ర్యాలీ నిర్వహించారు.

ఇఫ్టూ ఆధ్వర్యంలో..

మేడే సందర్భంగా పంపుల చెరువు వెహికల్ షెడ్, ఏఎంసీ వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. యార్డు యూనియన్ ఆధ్వర్యంలో 8 సెంటర్లలో, హమాలీ జట్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో 12 సెంటర్లలో, పట్టణ హమాలీ సంఘం ఆధ్వర్యంలో 7 చోట్ల, రైల్వే గూడ్సు షెడ్, సివిల్ సప్లై చుట్టల కార్మికులు, క్యాడ్ బరీ తదితర ఫ్యాక్టరీ కార్మికులు ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేశారు. పాత మార్కెట్ సెంటర్ నుంచి మెయిన్ బజార్, బిర్లా భవన్ మీదుగా ఏగు గోరీల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ మేడే విశిష్టతను వివరించారు. నాయకులు యు.వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు, ఎర్రా శ్రీనివాసరావు, కాకర్ల అప్పారావు, జి.రాంబాబు, డి.వీరినాయుడు, నెహ్రూబాబు, రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో..

మెయిన్ బజార్ జలవాని సెంటర్లో జట్టు లాగుడు బండ్ల కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏఐటీయూసీ పతాకాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆవిష్కరించారు. కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, జట్టు లాగుడు బండ్ల కార్మిక సంఘం అధ్యక్షుడు పుప్పాల కన్నబాబు, నాయకులు మారిన వెంకట్రావు, వంగలపూడి గంగరాజు, పి.శ్రీనివాసు, ఎస్ సోమేశ్వరరావు తదితరులు మాట్లాడారు. కోటదిబ్బ ఎస్సార్ వన్ వద్ద జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్, ఏలూరు పట్టణ పొగాకు పనివారల సంఘం, ఏలూరు దక్షిణపు వీధి సెంటర్, భగత్ సింగ్ సెంటర్, కోటదిబ్బ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయం వద్ద మేడే వేడుకలు నిర్వహించారు.

పవరుపేటలోని మేదర్ల కాలనీలో..

మేడే వేడుక ఘనంగా నిర్వహించారు. మేడే ఉత్సవ కమిటీ నాయకులు కట్టా సత్యనారాయణ, జీవీఎల్ నరసింహారావు, వీజీఎం కృష్ణారావు, ఎ.సత్యనారాయణ మాట్లాడారు. న్యాయవాదులు కె. కృష్ణారావు, మేదర సంక్షేమ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

గోకుల్ కల్యాణ మండపంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో మేడే వేడుక నిర్వహించారు. ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా అందించే వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్మిక శాఖ ఏలూరు ఉప కమిషనర్ సీహెచ్ ఆలోచన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోన్న కార్మిక సంక్షేమ పథకాలను వివరించారు. కార్మికుల సమస్యలపై చర్చించారు. ఏసీఎల్ టీవీవీ ఆదినారాయణ మూర్తి, సూపరింటెండెంట్ ఎస్‌కేఎండీ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేయాలి

హక్కుల సాధనకు ఐక్యంగా పనిచేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి కార్మికులకు సూచించారు. నగర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మేడే వేడుకలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హక్కులకు భంగం వాటిల్లితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కట్టా సత్యనారాయణ, న్యాయవాది బి.సంగీతరావు, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు బుద్ధ నాగ సూర్య బాబు, ఏలూరు ఆటో యూనియన్ అధ్యక్షుడు అమర్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

శ్రామికవర్గమే ఆర్థిక వ్యవస్థకు పునాది

శ్రామికవర్గంతోనే ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ అన్నారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద నిర్వహించిన మేడే వేడుకలో ప్రభాకర్, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో భజంత్రీ శ్రీనివాస్, కురెళ్ల వరప్రసాద్, కొండేటి రాంబాబు, ఉప్పులూరి రవి, నాగం అచ్యుత్, పెచ్చెట్టి శ్రీను, బళ్ల కనకదుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

హక్కులూ సాధించుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కార్మికులు తాము పని చేస్తోన్న సంస్థల అభివృద్ధికి పాటుపడుతూనే తమ హక్కులను సాధించుకోవాలని ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్ రాజు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 327 ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ స్టోర్స్ వద్ద మేడే వేడుక నిర్వహించారు. స్టోర్స్ ఆవరణలో యూనియన్ జెండాను యూనియన్ డిస్కం అధ్యక్షుడు భూక్య నాగేశ్వరావు నాయక్ ఆవిష్కరించారు. సాల్మన్ రాజు, ఏలూరు ఆపరేషన్ ఈఈ టి.శశిధర్, ఏలూరు ఆపరేషన్ సీనియర్ అకౌంటెంట్ కె.సత్య కిషోర్, యూనియన్ ఏలూరు డివిజన్ అధ్యక్షుడు పాతాళ్ల శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. ఎం.ఝాన్సీరాణి, ఈ ఎస్‌జీ కృష్ణంరాజు, ఉజ్జూరు రాము, సాయిబాబు, తురగా రామకృష్ణ, బొరగం దుర్గాప్రసాద్ దొర, ఎర్ర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కాల భైరవి అమ్మవారి తిరునాళ్ల ప్రారంభం

పెదవేగి : పెదవేగిలో వేంచేసియున్న కాలభైరవి అమ్మవారి తిరునాళ్లు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ తాతా శారద, గౌరవాధ్యక్షుడు రాజులపాటి బాపనయ్య, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పోతురాజుబాబు స్వామి, గంగానమ్మ అమ్మవార్లకు 101 బిందెలతో జలాభిషేకం, 101 కొబ్బరికాయలతో నివేదన, అనంతరం కాలభైరవీ అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం తిరునాళ్లను ప్రారంభించారు. రాత్రి 7 గంటలకు కాసగాని సుబ్బారావు గురువు ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. రాత్రి పది గంటలకు శ్రీలక్ష్మీ తిరుపతమ్మవారి జీవిత చరిత్ర నాటకం ప్రదర్శించారు.

వర్షానికి నగర రోడ్లు జలమయం



శేఖర్‌వీధి ప్రాంతంలో డ్రెయినేజీని పరిశీలిస్తున్న నగర కమిషనర్ వెంకట కృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో వర్షం పడితే చాలు రోడ్లన్నీ కాలువలను తలపిస్తున్నాయి. డ్రెయినేజీలు పూడుకుపోవటంతో వర్షపునీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి మురుగునీరు రోడ్లపైకి వస్తుంది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరపాలక సంస్థ చెత్త, వ్యర్థాలను డ్రెయినేజీల్లో వేయవద్దని ప్రజలకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవటంతో కష్టాలు తప్పటం లేదని అధికారులు పేర్కొంటున్నారు. సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి ఏలూరు నగరంలోని రోడ్లు జలమయమయ్యాయి. నగరంలోని లోతట్టు ప్రాంతాలయిన పవర్‌పేట రోడ్డు, శేఖర్‌వీధి, ఆర్‌ఆర్‌పేట, సదానంద స్కూల్ రోడ్డు, జాలిపూడి డ్రెయినేజీ, వన్‌టౌన్‌లోని కత్తేపువీధి రోడ్డు, వెంకన్న చెరువు రోడ్డు, సీఆర్‌ఆర్ కాలేజీ సమీపంలోని రైల్వే అండర్‌పాస్ రోడ్డు తదితర ప్రాంతాలను నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ సోమవారం ఉదయం పరిశీలించారు. డ్రెయినేజీల్లో మురుగు నీరు, వర్షపు నీరు పారుదలకు అడ్డంకులు ఏర్పడడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతున్నట్టు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలను కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బందికి సూచించారు. చెత్త వ్యర్థాలను డ్రెయినేజీల్లో వేయకుండా ఇంటింటికీ వచ్చే చెత్తసేకరణ వాహనాలకు మాత్రమే ఇవ్వాలని ప్రజలను కోరారు. వ్యాపార సంస్థలు, రోడ్డు పక్కన చిరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా చెత్తను డ్రెయినేజీల్లో వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఏలూరు నగరంలో సోమవారం వేకువ జాము నుంచే వలంటీర్లు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగా ఏలూరు కొత్తపేటలోతోట ఈశ్వరమ్మకు వృద్ధాప్య పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ ఆర్.దివ్య - సాక్షి ఫొటో గ్రాఫర్, ఏలూరు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	36	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-07
బెండకాయలు	24	కంద	48
పచ్చిమిర్చి	42	బీట్‌రూట్	40
కాకర కాయలు	44-50	కీరా దోస	34
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	48	అల్లం	140
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	18	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	38	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణీ	--
అనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	15-20	చిలకదదుంప	26

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	14
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	21
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	11
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	--
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	32
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 బ్యాచ్ విద్యార్థులు

పెదపాడు: పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. 2006-07లో పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 16 ఏళ్ల క్రితం 10వ తరగతి చదువుకున్న వారంతా ఆదివారం ఒకరినొకరు కలుసుకున్నారు. బాల్య స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవదుల్లేవు. పాఠశాలలో తామంతా కలిసి నాడు చేసిన చిలిపి చేష్టలు, హోమ్ వర్క్ చేయకపోతే ఉపాధ్యాయులు పెట్టిన చీవాట్లు, కొట్టిన దెబ్బలు, మైదానంలో ఆటలాడేటప్పుడు తగిలిన దెబ్బలు, ఆడేటీరు, తోటి విద్యార్థులు నిక్‌నేమ్‌లతో పిలుచుకున్న ఆనాటి మధుర స్మృతులను వారంతా నెమరు వేసుకున్నారు. తోటి విద్యార్థులు అంతా ఒకచోటకు చేరుతున్నామనే ఆనందంతో ఉదయం 9 గంటలకే పాఠశాలకు చేరుకున్న వారంతా ఎంతో ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. వివిధ వృత్తులలో స్థిరపడినా తామంతా విద్యార్థులమేనంటూ ఉపాధ్యాయులతో ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, దుశ్శాలువాలతో విద్యార్థులంతా కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవీకే చౌదరి, మహమ్మద్ అలీ, జీ ప్రసాదరావు, పువ్వుల నాగేంద్రప్రసాద్, గారపాటి భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



స్పందన ఫిర్యాదులపై ఆడిట్ నిర్వహిస్తున్న మండల అధికారులు

పెదవేగి : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసుకొని సత్వరం న్యాయం పొందాలని తహసీల్దార్ ఎస్ నాగరాజు అన్నారు. పెదవేగి మండల తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారుల నేతృత్వంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో గత ఏప్రిల్ 15 నుంచి 30 వరకు నిర్వహించిన స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన 26 ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలు, వాటి పరిష్కార ప్రగతిపై అధికారులు వేరిఫికేషన్ (ఆడిట్) చేశారు. అధికారులు రెవెన్యూ శాఖకు వచ్చిన 12 ఫిర్యాదులను, మండల పరి షత్ కార్యాలయానికి సంబంధించి వచ్చిన 6 ఫిర్యాదులు, పోలీస్‌శాఖకు సంబంధించి వచ్చిన 8 ఫిర్యాదుల ప్రగతిపై పరిశీలించినట్టు మండల స్పెషల్ ఆఫీసర్ నాగరాణి, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ రాజ్ మనోజ్ తెలిపారు. వ్యవసాయాధికారి ప్రియాంక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతారత్నం, ఈఓఅండ్‌పీఆర్డీ శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం శరత్, హౌసింగ్ ఏఈ నాగరాజు, హెచ్‌ఓ రత్నమాల పాల్గొన్నారు.

జోరుగా వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ

భీమడోలు: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ జోరుగా సాగింది. తొలిరోజు సోమవారం భీమడోలు మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలోని 8,785 మందిలో 7579 మందికి పింఛన్ సొమ్ము అందించారు. దీంతో పంపిణీ 86.27 శాతం నమోదైంది. భీమడోలులో సోమవారం డయాలసిస్ బాధితునికి మంజూరైన కొత్త పింఛన్ రూ.10 వేలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీరంగ, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాము సునీతామాన్‌సింగ్, ఎంపీటీసీ ఆల్తి గోపిలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌దారుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి నెల ఒకటవ తేదీనే పింఛన్ సొమ్మును గడపగడపకు వచ్చి లబ్ధిదారునికి నేరుగా అందిస్తోన్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును నిండైన మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు, వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

దెందులూరు: అకాల వర్షాలకు తడిచిన ధాన్యం మొలకలు వస్తున్నాయని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.శ్రీనివాస్ అన్నారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాలన్నారు. సోమ వారం కొవ్వలిలో ఆయన తడిచిన ధాన్యాన్ని పరిశీలించారు. ఆయనమాట్లాడుతూ కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయి రైతులు నష్టపోయారన్నారు.

బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: తమ పేరుమీద భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని కొంతమంది వ్యక్తులు తనను బెదిరిస్తున్నారని జంగారెడ్డిగూడెంకు చెందిన చిన్నం సాయిబాబారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న సాయిబాబారెడ్డికి 71 సెంట్ల భూమి ఉంది. ఈ కరుటూరి బాల స్వామి, మిధున్ వారి పేరున రిజిస్టర్ చేయాలని పొలంలోకి ప్రవేశించి ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశారని, తనను చంపుతామని ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని సాయిబాబరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

రేషన్ బియ్యం స్వాధీనం

లింగపాలెం : ధర్మాజీగూడెంలో పురుషోత్తం అనే వ్యక్తి ఇంటిలో నిల్వ ఉన్న రేషన్ బియ్యంను విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. 1,200 కేజీల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు విజిలెన్స్ ఎస్సై నాగరాజు తెలిపారు. ఈబియ్యంను చింతలపూడి సివిల్ సప్లయ్ డీటీ జరీనా, వీఆర్‌వోలకు విజిలెన్స్ అధికారులు అప్పగించారు.